క్లుప్తంగా

జెడ్పీ నిధులతో నూతన బోరు



బోరు డ్రిల్లింగ్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని జవునపల్లె పంచాయతీ నాగులకుంట, చింతలగుంటలో కొంత కాలంగా తాగునీటి సమస్య వేధిస్తోంది. గ్రామస్తులు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దృష్టికి సమస్య నివేదించడంతో ఆయన స్పందించారు. జెడ్పీ నిధులతో బోరు పనులకు సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అలాగే గ్రామానికి నీటి సరఫరా కోసం పైపులు, మోటారును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. నాగలకుంట గ్రామంలో దాదాపు 650 అడుగుల వరకు డ్రిల్ చేయగా 3 ఇంచీల నీళ్లు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చింతలగుంటలో సోమవారం రాత్రి వరకు 500 అడుగుల వరకు డ్రిల్ ఇంకా కొనసాగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్‌తోపాటు ఆయన తనయుడు అమరనాథ్, ఎంపీటీసీ శివరంజని, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

సదుం: మండలంలోని ఊటుపల్లె పంచాయతీ శివపురం వద్ద అంకాళమ్మ నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గతంలో రోడ్డు పక్కన ఉన్న ఆలయాన్ని తొలగించారు. ఈ నేపథ్యంలో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. భూమి పూజలో సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయరూ!



రాయలు చిత్రపటానికి నివాళులు

సదుం: మండల కేంద్రంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని బలిజ సంఘం నాయకులు తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. అంతకుముందు పెట్రోల్ బంకు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రాయల చిత్రపటంతో సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాయల్ పీపుల్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు రెడ్డి శేఖర్, రమేష్, శ్రీకాంత్, కుమార్, వెంకటరత్నం, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు వంట సరుకుల వితరణ



ప్రత్యేక ప్రతిభావంతులతో దాతలు, నిర్వాహకురాలు

వీ.కోట: స్థానిక సాయిగార్డెన్‌లోని ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలకు శ్రీ సత్యసాయి సేవా సంస్థ సోమవారం నెలకు సరిపడా వంట సరుకులు వితరణ చేసింది. సేవా సంస్థ అధ్యక్షుడు మధుసూదన్, కన్వీనర్ చంద్రశేఖర్ వీటిని పాఠశాల నిర్వాహకురాలు భార్గవికి అందజేశారు. వారు మాట్లాడుతూ, ఆదర్శ పాఠశాలకు తమ వంతు సాయం చేస్తున్నట్టు చెప్పారు. అలాగే భారత్‌నగర్‌లోని వృద్ధాశ్రమానికి సైతం వితరణ చేసినట్టు చెప్పారు.

ఉత్తమ టీచర్‌కు సన్మానం



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న టీచర్లు

కుప్పం రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న అడవిబూదుగూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట నాగేశ్వరరావును ఆ గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చిట్టిబాబు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఎంతో ఉన్నతంగా నడుచుకున్న వెంకటనాగేశ్వరరావుకు అవార్డు అందుకోవడం అభినందనీయమని, ఆయన్ను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేష్‌కుమార్, రమేష్‌బాబు, ప్రసన్నలక్ష్మి, సతీష్, హేమలత, రాజకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో తప్పిదం..ప్రజలకు శాపం

2014–19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో నాయకులు రోడ్డు పనుల్లో చేసిన తప్పిదాలు ఇప్పుడు ప్రజలకు శాపంగా మారాయి. అండర్ డ్రైనేజీ పనులు చేశాకే సీసీ రోడ్లు వేయడం ఉత్తమమని అధికారులు చెప్పినా పట్టించుకోకుండా ఆత్రం కొద్దీ రోడ్లు వేశారు. ఇప్పుడు వాటిని తవ్వుతుండడంతో రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. ఇళ్ల ముందు మురుగనీటి కాలువపై వేసి కాంక్రీట్‌ను తవ్వేసి కుప్పం మున్సిపాలిటీ అధికార యంత్రాంగం వాటిని తిరిగి పూడ్చకపోవడంతో ఇళ్ల యజమానులు గగ్గోలు పెడుతున్నారు. తమ జేబుకు చిల్లు పెడుతున్నారని మండిపడుతున్నారు.

- డ్రైనేజీ కోసం ఇష్టానుసారంగా తవ్వకాలు
- ప్రజాధనం దుర్వినియోగం
- ఇంటి యజమానులకు అదనపు ఖర్చు
- అధ్వానంగా మారుతున్న కుప్పం వీధులు



పట్టణంలో మురుగునీటి కాలువను జేసీబీతో తవ్వుతున్న దృశ్యం

కుప్పం: 2014–19లో అధికారంలో ఉన్నా టీడీపీ ప్రభుత్వం మేజర్ పంచాయతీగా ఉన్న కుప్పం అభివృద్ధి చేసేందుకు రూరల్ అర్బన్ మిషన్ కింది ఎంపిక చేసింది. దీంతో పట్టణంలో సిమెంట్ రోడ్లు వేయడానికి అధికార పార్టీ నేతలు పూనుకున్నారు. అప్పట్లో ఉన్న అధికారులు పట్టణంలో అండర్ డ్రైనేజ్ సిస్టం పనులు చేసిన అనంతరం సీసీ రోడ్లు వేయాలని, ఈ పనులు చేయకుండా సీసీ రోడ్లు వేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారు. అంతేకాకుండా తర్వాత కాలంలో సీసీ రోడ్లు తవ్వి పనులు చేయాల్సి వస్తే ఎంతో ప్రజాధనం వృధా అయినట్లవుతుందని కూడా అప్పట్లో హెచ్చరించారు. అయితే వారి మాటలను టీడీపీ నాయకులు పెడచెవిన పెట్టారు. సీసీ రోడ్ల పనులకు రూ.150 కోట్లు మంజూరు కావడంతో కమీషన్ల కోసం అధికార పార్టీనేతలు కాంట్రాక్టర్లతో లాలూచీ పడి ఇష్టానుసారంగా సీసీ రోడ్లు వేసి వేసి బిల్లు మంజూరు చేయించుకుని నిధులు ఆరగించేశారు.

తవ్వకం పనులతో వీధులన్నీ అధ్వానం

పట్టణం ప్యాలెస్ రోడ్డులో మురుగు కాలువ బ్లాక్ అయిందని సిమెంట్ రోడ్డును ఇష్టానుసారంగా తవ్వేశారు. రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ మళ్లించారు. ఫలితంగా సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా తవ్వేయడం మూలాన పట్టణంలోని వీధులన్నీ మురుగు నీరు, చెత్తాచెదారంతో పరిస్థితి అధ్వానంగా మారింది. దుర్గంధం చిమ్ముతూ అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మురుగు కాలువల బ్లాకేజీని తొలగించకుండా రోడ్డు తవ్వేయడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ పనుల వల్ల రూ.150 కోట్లతో వేసిన సీసీ రోడ్లంతా రూపురేఖలు మారి చివరకు తమ జేబుకు చిల్లు పెడుతున్నారని లబోదిబోమంటున్నారు.

ఇళ్ల యాజమానులకు అధిక భారం

ప్యాలెస్ రోడ్డు ఇరువైపులా ఉన్న మురుగు కాలువను తవ్వడం వల్ల ఇంటి యజమానులపై భారం పడింది. కాలువ తవ్వకం వల్ల ఏర్పడిన గుంతలు, కాంక్రీట్, బండరాళ్లను సరిచేసుకోవాల్సిన బాధ్యత ఇంటి యజమానులదేనని మున్సిపాలిటీ అధికారులు చెప్పడంతో హతాశులయ్యారు. దీంతో ఒక ఇంటి యాజమాని రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వ్యయం చేసి తమ ఇళ్ల ముందు కాలువను పూడ్చుకోవాల్సిరావడంతో ప్రజలు అధికారుల తీరును దుమ్మెత్తిపోస్తున్నారు. అభివృద్ధి విషయంలో ముందస్తు ప్రణాళికాబద్ధంగా పనులు చేయకపోవడం మూలాన ప్రజలపై ఆర్థిక భారం పడింది. కాలువలో అక్కడక్కడా తవ్వి మురుగునీటి కాలువ బ్లాక్ క్లీన్ చేయకుండా అధికారులు ఇష్టానుసారం తవ్వేయడం తగదని స్థానికులు నిరసిస్తున్నారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలసిన ఎంపీపీ



ఎంపీపీని ఆత్మీయంగా సన్మానిస్తున్న ఎమ్మెల్యే

సదుం: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఇటీవల ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన ధనుంజయరెడ్డి తిరుపతిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్ హనుమంత రెడ్డి, దామోదర, వాసు, హరినాథ రెడ్డి, డింపుల్ రెడ్డి, సురేష్, భాస్కర్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన



దాడి ఘటనపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పలమనేరు: పెద్దపంజాణి మండలం నడింపల్లెలో దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ప్రజాసంఘాల నాయకులు బాధితులతో కలసి ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ, వాల్మీకి జయంతి వేడుకల్లో డప్పు కొట్టలేదనే కారణంగా దళితులపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవీ మునిరత్నం, శివాడి గోవిందు, మంజునాథ్, చంద్రకుమార్, అమరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమర వీరులకు నివాళి

పలమనేరు: పట్టణంలోని సీఐ కార్యాలయం వద్ద సోమవారం పోలీసు అమరవీరుల దినం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి, మౌనం పాటించి, వారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. సీఐ నరసింహరాజు మాట్లాడుతూ, 1959లో దేశ సరిహద్దుల్లో అక్సాయ్ చిన్ ప్రాంతంలో విధి నిర్వహణలో అసువులు బాసిన వారి సంస్మరణార్థం ఏటా ఈ కార్యక్రమాన్ని పోలీసుశాఖ నిర్వహిస్తోందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన కొందరి జీవితాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

గంగవరంలో..



గంగవరం పోలీస్ స్టేషన్‌లో..

గంగవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం గంగవరం పోలీస్ స్టేషన్‌లో అర్బన్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. విధి నిర్వహణలో అమరవీరులైన పోలీసులను స్మరించుకుని నివాళులు అర్పించారు. అమరులైన పోలీసులను స్మరించుకోవడం బాధ్యతగా భావించాలని సీఐ అన్నారు. ఏఎస్ఐ రుక్మాంగద నాయుడు, కానిస్టేబుల్ సురేంద్ర, రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యం నుంచే నైతిక విలువలు ముఖ్యం



విద్యార్థినులకు పుస్తకాలను అందజేసిన నిర్వాహకులు

పలమనేరు: విద్యార్థులు బాల్యం నుంచే నైతిక విలువలను పాటించాలని శతావధాని ఆముదాల మురళి అన్నారు. సోమవారం వివేకానందుని జీవితం, ఆదర్శాలు అనే పుస్తకాలను పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు ఉచితంగా పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పిల్లలు పుస్తకపఠనాన్ని అలవరచుకోవాలన్నారు. ఇప్పటి తరం పిల్లలు పుస్తకాలను పక్కన పెట్టి సెల్‌ఫోన్లతో ఎక్కువ సమయం గడుపుతున్నారని, ఈ విషయంలో తల్లిదండ్రులు కాస్త బాధ్యత వహించాలన్నారు. అనంతరం తిరుపతికి చెందిన రామకృష్ణ సేవాసమితి ప్రతినిధులు విద్యార్థినుల కోసం శానిటరీ న్యాప్‌కిన్లను దహనం చేసే రెండు యంత్రాలను స్కూలుకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, రామకృష్ణ, అచ్యుత్, అఖిల్, హెచ్‌ఎం ప్రశాంతి పాల్గొన్నారు.

సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వీ.కోట: మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ యువరాజు కోరారు. సోమవారం ఆయన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలన్నారు.ఎంపీడీఓ ఈశ్వరన్, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, సర్పంచ్ సుభాష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బనకందొడ్డిలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మండలంలోని బనకందొడ్డిలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి. మురళి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి పరీక్షించారు. వారి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను గ్రామస్తులకు తెలియజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ఇళ్ల పరిసరాల్లో మురుగు, వర్షపు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ అరుణకుమారి, ఏఎన్‌ఎం వసంత కుమారి, ఆశా వర్కర్లు నారాయణమ్మ, వసుంధర, శ్రావణి పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

పలమనేరు: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మెగా డీఎస్సీకి ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ హైమవతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడునెలల పాటు భోజనం, వసతిని కల్పించి శిక్షణ ఇస్తామని, వార్షికాదాయం రూ.2.50లక్షల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి కలవారు జ్ఞానభూమి పోర్టల్‌లో ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పవిత్రోత్సవం



ఆలయం వద్ద హోమం చేస్తున్న వేద పండితులు

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లెలో శ్రీ పద్మావతి శ్రీనివాసస్వామి పవిత్రోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా చివరి రోజున ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజార్చనలు, అభిషేకాలు, హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

కుంభాభిషేకం



ఊరిగంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న కుంభాభిషేకం

కుప్పం: మున్సిపాలిటీలోని బేవనపల్లె నూతన ఊరిగంగమ్మ ఆలయంలో కుంభాభిషేకం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మూడు రోజుల పాటు కలశస్థాపన, మహా గణపతి హోమం, వాస్తు హోమాలు చేసి చివరి రోజు అమ్మవారిని ప్రతిష్ఠించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణలో మంగళవాయిద్యాల హోరు నడుమ మధ్య కలశాలను ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదానం చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



హైస్కూల్‌లో భోజనం రుచి చూస్తున్న సివిల్ జడ్జి లిఖిత

- జూనియర్ సివిల్ జడ్జి లిఖిత హెచ్చరిక

పలమనేరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పలమనేరు జూనియర్ సివిల్‌జడ్జి లిఖిత హెచ్చరించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత, ఉర్దూ స్కూళ్లలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం రుచి చూశారు. ఉర్దూ పాఠశాలలో భోజనం సరిగా ఉడకకపోవడంపై అక్కడి హెచ్‌ఎంను హెచ్చరించారు. హైస్కూల్‌లో వంటగది దెబ్బతిని వర్షానికి తడుస్తోందని, ఇలాంటి చోట ఆహార పదార్థాలను నిల్వ ఉంచడం సరికాదన్నారు. ఇకపై బడుల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తామని, ఏదైనా తేడా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లేగ దూడల పెంపకంతో అధిక ఆదాయం



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రొంపిచెర్ల: రైతుల లేగ దూడల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చునని ఏడీ శ్రీనివాసులు నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని గానుగచింత గ్రామ పంచాయతీ కల్లావారిపల్లెలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 135 పశువులకు పిడుదల నివారణకు మందు పిచికారీ చేశారు. అలాగే 28 దూడలకు నట్టల నివారణకు మందు తాపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, లేగ దూడలను పెంచుకుంటే మంచి ఆదాయం వస్తుందన్నారు. చిన్న వయస్సులో ఉన్న దూడలను కొనుగోలు చేసి వాటిని సంవత్సరం పాటు మేపితే చాలన్నారు. లేగ దూడల పెంపకం కోసం ప్రభుత్వ నుంచి ఉచితంగా దాణా పంపిణీ చేయడంతోపాటు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ డాక్టర్ సుబ్బారావు, పశువైద్యాధికారులు శ్రీధర్, చందనప్రియ, సిబ్బంది మోహిత్ పాల్గొన్నారు.

కౌండిన్య నదిపై ఏటిగడ్డకు వంతెన నిర్మించరూ!

- ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు గ్రామస్తుల వినతి



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పలమనేరు: కౌండిన్య నదిని దాటి తమ గ్రామాలకు వెళ్లడానికి అనువుగా వంతెన నిర్మించాలని మండలంలోని ముసలిమొడుగు, ఏటిగడ్డ గ్రామస్తులు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలనాధికారి సీకే శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, నదిలో నీరున్నప్పుడు గ్రామానికి వెళ్లాలంటే పది కిలోమీటర్లు చుట్టుతిరిగి క్రిష్టాపురం మీదుగా వెళ్లాల్సి వస్తోందన్నారు. ముసలిమొడుగు రైతులు నదిని దాటి వ్యవసాయం చేస్తున్నారని, వ్యవసాయోత్పత్తులను గ్రామానికి తీసుకెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. యానాదులు ఎక్కువగా నివసించే తమ గ్రామానికి వంతెన కావాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అదే విధంగా కౌండిన్య నదీ ప్రవాహానికి నదికి ఇరువైపులా పొలాలు కోతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నదికిరువైపులా సిమెంట్‌తో గోడ నిర్మించాలని ఇరిగేషన్ జేఈ జయలక్ష్మికి మరో వినతిపత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘ నేత ఉమాపతి, రిటైర్డ్ టీచర్ పుష్పరాజ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి 'ప్రజా దర్బార్'

- అభివృద్ధి పనులకు రూ.50కోట్లు విడుదల
- కడా పీడీ వికాస్ మర్మత్ వెల్లడి



వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో నవంబర్ 13వ తేదీ నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కడా పీడీ వికాస్ మర్మత్ వెల్లడించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడారు. ప్రజాదర్బార్‌లో భాగంగా ప్రతి బుధవారం ఒక పంచాయతీలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని అధికార యంత్రాంగం రోజంతా అక్కడే గడుపుతుందన్నారు. మధ్యాహ్నం వరకు గ్రామంలో సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ, అనంతరం ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత , ప్రజా సమస్యలను తెలుసుకుంటామన్నారు. కుప్పానికి ప్రస్తుతం అభివృద్ధి పనులకు రూ.50 కోట్లు నిధులు విడుదలయ్యాయని, త్వరలో దీనికి సంబంధించి టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ప్రజలు నివేదించిన సమస్యలను జాప్యం చేయకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అయోడిన్ లోపిస్తే ఎదుగుదల కష్టం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్

బైరెడ్డిపల్లె: ప్రపంచ అయోడిన్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం మండలంలోని కమ్మనపల్లె కస్తూర్బా గురుకుల పాఠశాలలో బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్య బృందం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ మాట్లాడుతూ, ఆహారంలో అయోడిన్ తక్కువ అయితే పిల్లల్లో బుద్ధిమాంద్యం సమస్య తలెత్తుతుందని, అలాగే శారీరక, మానసిక ఎదుగుదల, చురుకుదనం తక్కువగా ఉంటుందన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు అయోడిన్ కలిగిన ఉప్పును ఆహారంలో వాడాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ ఉష, సీహెచ్‌ఓ జ్యోత్స్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భరతనాట్య విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

అభినందన

పలమనేరు: తిరుపతి మహతి ఆడిటోరియంలో ఇటీవల వే ఫౌండేషన్ వార్షికోత్సవ సందర్భంగా జిల్లా స్థాయి భరతనాట్య పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ బాబు, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థుల కూచిపూడి, భరతనాట్యం, శివతాండవం ప్రదర్శనలను ఉత్తమ ప్రదర్శన కింద ఎంపిక చేసి సర్టిఫికెట్లను అందజేశారని ఆయన తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

పలమనేరు: మండలంలో మంగళవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ అన్నునాధన్ సోమవారం తెలిపారు. తొలిరోజున అంకెంవారిపల్లె, 23న అయ్యంరెడ్డిపల్లె, 24న గుండ్లపల్లె, 25న జల్లిపేట, 26న ఎస్‌ఆర్‌ఆర్ పురం, 29న మొరం, 30న సముద్రపల్లె, వచ్చేనెల 5న పెంగరగుంటలో ఈ సభలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. రైతులు తమ శాఖకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

గుడుపల్లె: భూములకు సంబంధించి మార్పులు–చేర్పుల నిమిత్తం మంగళవారం నుంచి వచ్చే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీతారాం తెలిపారు. గతంలో భూ సర్వే చేసిన 19 రెవెన్యూ గ్రామాలలో గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు.